# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 187 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 10 - 01 - 2026




2025 రికార్డు స్థాయిలో వేడెక్కిన సముద్రాలు
చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగిన ఉష్ణం

# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

- చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా
- వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన
- జల వివాదాలను మనమే పరిష్కరించుకుందామన్న రేవంత్ రెడ్డి
- రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య
- కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ
- ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి
- జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు
- రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.కోర్టుల ద్వారా కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని - మిగతా 2 లో



2 లో

## సికింద్రాబాద్ గుర్తింపును దెబ్బతీసే కుట్ర

- తలసాని శ్రీనివాస్ యాదవ్
- సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలన్న తలసాని
- 11వ తేదీన కీలక సమావేశం నిర్వహిస్తామని ప్రకటన
- 17న భారీ ర్యాలీ నిర్వహిస్తామన్న తలసాని

## ప్రజానాడి




## 'పున మార్గం' ఎఫెక్ట్... 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి భారీ షాక్
- భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు
- వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది
- 'పున మర్గం' ప్రచారంతోనే జనజీవన స్రవంతిలోకి
- లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు




ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ.1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం.దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన 'పున మర్గం' (పునరావాసం - పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు - మిగతా 2 లో

## ట్రంప్‌కు మోదీ ఫోన్ చేస్తే డీల్ ఓకే

- కానీ మోదీ నిరాకరిస్తున్నారు
- అమెరికా మంత్రి కీలక వ్యాఖ్యలు
- ట్రంప్‌తో మోదీ నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడం వల్లే ట్రేడ్ డీల్ ఆలస్యమన్న హోవార్డ్
- బ్రిటన్ ప్రధాని అదే రోజు మాట్లాడటంతో డీల్ పూర్తయిందని వెల్లడి
- మోదీ ఫోన్ చేయడానికి నిరాకరించినప్పటికీ ఇంకా అవకాశం ఉందన్న హోవార్డ్



ఢిల్లీ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడం వల్లే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చల సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కార్యరూపం - మిగతా 2 లో

## సంక్రాంతి అంటే కోడిపందేలే కాదు తెలంగాణకు ఆంధ్రా ప్రేమను పంచండి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పిఠాపురంలో 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల'ను ప్రారంభించిన పవన్
- తెలంగాణ సోదరులకు గోదావరి జిల్లాల ఆతిథ్యం రుచి చూపాలని పిలుపు
- చిన్న విషయాలను వైరల్ చేస్తున్నారని, వ్యవస్థను బలోపేతం చేయడానికే వచ్చానని స్పష్టీకరణ
- అధికారంతో సంబంధం లేకుండా చివరి శ్వాస వరకు పిఠాపురానికి సేవ చేస్తానని హామీ



అమరావతి : తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రేమను, ఆతిథ్యాన్ని తీసుకెళ్లాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో మూడు రోజుల పాటు జరగనున్న 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల'ను ఆయన ఇవాళ మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌లతో కలిసి ప్రారంభించారు. - మిగతా 2 లో

## తిరుమలలో రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు

- వివరాలు వెల్లడించిన టీటీడీ
- విజయవంతంగా ముగిసిన తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు
- రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం
- 10 రోజుల్లో రూ.41 కోట్ల హుండీ ఆదాయం, 44 లక్షల లడ్డూల విక్రయం
- టీటీడీ ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి
- ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్‌తో క్యూలైన్ల పర్యవేక్షణ విజయవంతం



2 లో

# భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు
- రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ
- ప్రజావేదికలో సభలో మాట్లాడుతూ పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని వెల్లడి
- కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని సీఎం చంద్రబాబు
- 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు
- గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు పాస్‌బుక్‌లు ఇస్తున్నామని సీఎం వెల్లడి




అమరావతి : కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదికలో సభలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని అన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని సీఎం తెలిపారు.గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నామని సీఎం వెల్లడించారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పానని ఆ విధంగా ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పని చేయాలని - మిగతా 2 లో

## టీటీడీని అభినందించిన సీఎం చంద్రబాబు

- వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీకి సీఎం చంద్రబాబు ప్రశంసలు
- డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు ఉత్తర ద్వార దర్శనం
- మొత్తం 7.83 లక్షల మంది భక్తులకు దర్శన భాగ్యం
- దర్శించుకున్న వారిలో 97 శాతం సామాన్య భక్తులేనని చంద్రబాబు వెల్లడి
- తిరుమల పవిత్రతను కాపాడాలని భక్తులకు సీఎం విజ్ఞప్తి




అమరావతి : తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), జిల్లా యంత్రాంగాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఉత్తర ద్వార దర్శనం కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు.డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు కల్పించిన ఉత్తర ద్వార దర్శనంలో మొత్తం 7.83 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని సీఎం తెలిపారు. దర్శనం చేసుకున్న వారిలో 97 శాతం మంది సామాన్య భక్తులే ఉండటం ఎంతో సంతోషకరమని, ఇది - మిగతా 2 లో

# సంపాదకీయం

## కాలుష్యం కోరలు తీసేదెలా?



సంకల్పం ఉంటే దేన్నయినా సాధించవచ్చంటారు. అది కొరవడటం దేశ రాజధాని నగరానికి శాపంగా మారింది. కనుకనే కాలుష్యం అక్కడి నుంచి కదలనంటున్నది. ఈ సంగతి తెలిసే సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం)ను తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన కాలుష్య కారకాలను గుర్తించి, ఏయే పరమాణువులు ఏ మేరకు కారణమవుతున్నాయో, వాటిని అరికట్టడానికి ఏం చేయాలో చెప్పాలని కోరింది. మనం పీల్చే గాలితోపాటే నైట్రేట్‌లూ, సల్ఫేట్‌లూ, కర్బనాలు, కాడ్మియం, పాదరసం వంటి అత్యంత ప్రమాదకర పరమాణువులు ఊపిరితిత్తుల్లో ప్రవేశిస్తున్నాయి. నెత్తురుతోపాటే శరీరమంతటా ప్రవహిస్తున్నాయి. ఇవన్నీ గుండెపోటు, ఊపిరితిత్తుల క్యాన్సర్, నవజాత శిశు మరణాలూ తదితర దారుణాలకు కారణమవు తున్నాయి. అయినా అన్ని వ్యవస్థలూ కాలుష్యాన్ని ఆషామాషీగా తీసుకుంటున్నాయి. వివిధ అధ్యయనాలు చెబుతున్న దాన్నిబట్టి ఢిల్లీ వరకూ చూస్తే వాహనాల కాలుష్యమే అధికం. ఆ తర్వాత వరసగా పారిశ్రామిక ఉద్గారాలు, నిర్మాణరంగం వల్ల వెలువడే ధూళి, పంట వ్యర్థాలు తగలబెట్టినందువల్ల వచ్చే పొగ ఉంటాయి. కానీ నిర్దిష్టమైన డేటా లేనందువల్ల అరికట్టడం విషయంలో వెనకబడిపోతున్నాం.రెండు దశాబ్దాల క్రితం చైనా రాజధాని నగరం బీజింగ్ పరిస్థితి ఇదే. 2008లో బీజింగ్ ఒలింపిక్స్ జరుగుతున్న సందర్భంగా ఆ దేశం తొలిసారిగా కాలుష్యంపై రణభేరి మోగించింది. పలు తాత్కాలిక చర్యలు ప్రారంభించారు. అటుతర్వాత అయిదేళ్లపాటు అధ్యయనాలు నిర్వహించారు. వాటితోపాటే ప్రయోగాత్మకంగా వివిధ రకాల విధానాలు అమల్లోకి తెచ్చారు. ప్రధాన కాలుష్య కారకాలను గుర్తించారు. వాటి తీవ్రత ఆధారంగా వర్గీకరించారు. వాతావరణంలో అతి సూక్ష్మ ధూళి కణాల(పీఎం 2.5)ను సాధ్యమైనంత మేర తగ్గించాలని సంకల్పించారు.అటు తర్వాత 2013లో అయిదేళ్ల జాతీయ కార్యాచరణ పథకం రంగప్రవేశం చేసింది. బొగ్గు ఆధారిత బాయిలర్లను మూసివేయాలని నిర్ణయించటంతోపాటు ప్రజా రవాణా వ్యవస్థను అంచెలంచెలుగా మెరుగుపరిచారు. వివిధ పరిశోధనల ద్వారా కొత్త సాంకేతికతల్ని ఆవిష్కరించారు. హరిత ఇంధన వాడకమే వీటన్నిటి ధ్యేయం. కనుకనే అత్యంత కాలుష్య ప్రాంతాలుగా గుర్తించినవి కాస్తా నాలు గేళ్లలో గణనీయంగా మెరుగుపడ్డాయి. ఈ మెరుగుదల 35 శాతంపైగా ఉంది. మధ్యలో కరోనా మహమ్మారి విరుచుకుపడినా కాలుష్యంపై పోరు ఎక్కడా తగ్గలేదు. చైనా మాత్రమే కాదు... మనకన్నా బాగా వెనకబడిన ఫిలిప్పీన్స్, పెరూ, ఉరుగ్వే వంటి దేశాలు సైతం కాలుష్యాన్ని అరికట్టడంలో మెరుగైన విజయాలు సాధించాయి. ఒక్క ఢిల్లీ అనేమిటి... హైదరాబాద్ మొదలుకొని పది నగరాల వరకూ దాదాపు ప్రతిచోటా ఏడాది పొడవునా కాలుష్యం బుసలు కొడుతోంది. ఢిల్లీలో గురువారం సాయంత్రానికి వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) 328 (విపత్కరం)గా ఉన్నదని వెల్లడైందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో ఊహించుకోవచ్చు. 2022 జూలైలో సీఏక్యూఎం వెలువరించిన నివేదిక రవాణారంగం, పారిశ్రామిక ఉద్గారాలు, విద్యుత్ ప్లాంట్‌లు, వ్యర్థాల్ని తగలబెట్టడం, నిర్మాణరంగ పనుల వల్ల వెలువడే ధూళి వగైరాలు ప్రధానంగా కాలుష్యానికి కారణమవుతున్నాయని గుర్తించింది. కానీ వాటిని అరికట్టడానికి లేదా వాటి తీవ్రత తగ్గించటానికి జరిగిన కృషేమీ లేదు. ఈ విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటో సూచించాలంటూ గత నెల 17న సీఏక్యూఎంను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పుడు మళ్లీ మరోసారి చెప్పాల్సివచ్చింది. సీఏక్యూఎం ఒక్కటే దీన్ని సాధించటం సాధ్యంకాదు. అన్ని విభాగాలూ కలిస్తేనే సమస్యపై పోరాడటానికి వీలవుతుంది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సీఏక్యూఎం పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీస్, రవాణా విభాగం, మున్సిపాలిటీలు, కాలుష్య నియంత్రణ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా నిర్దిష్టమైన విధానం రూపొందించాలి. పకడ్బందీ కార్యాచరణ ఉండాలి. పొరుగునున్న చైనా నిర్దిష్టమైన కాలపరిమితి పెట్టుకుని లక్ష్యాన్ని సాధించగలిగినప్పుడు... మనకన్నా వెనకబడిన దేశాలు సైతం చేసి చూపిస్తున్నప్పుడు మనం ఎందుకు విఫలమవుతున్నామని ప్రశ్నించుకోవాలి. ఎక్కడ లోటుపాట్లున్నాయో సమీక్షించుకుని సరిచేసుకోవాలి.

## భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం



**మొదటిపేజీ తరువాయి –** ఆదేశించారు. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తామని తెలిపారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలని సూచించారు. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయని అన్నింటినీ పరిష్కరిస్తున్నామని సీఎం తెలిపారుఅలానే 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయని, ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నానని, ముందుగా కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దని కోరారు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితకాలం వృథా అవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు."గత పాలకులు గంజాయిని వాణిజ్య పంటగా మార్చారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికదే చివరిరోజు అదే చేసి చూపిస్తున్నాం. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ చనిపోయేందుకు కారణమయ్యారు. డాక్టర్ సుధాకర్ కుమారుడికి ఉద్యోగం ఇచ్చాం ఇంక రూ.కోటి సాయం చేశాం. గాడి తప్పిన పరిపాలనను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 5 ఏళ్లకు ఒకసారి ప్రభుత్వం మారితే దానివల్ల నష్టం ఎక్కువ వస్తుంది. గతపాలకులు చేసిన విధ్వంసాన్ని సరిచేసేందుకే సమయం సరిపోతుంది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని సరిచేసేందుకు మూడేళ్లు పడుతుంది. ఇంకా వారి ప్రభుత్వం వల్ల పోలవరం, అమరావతి ఆలస్యమయ్యాయి.నదుల పక్కనే పెద్దపెద్ద నగరాలు: నరకాసురిడి పాలన మళ్లీ రాకూడదని మనం కోరుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాలు వచ్చే 3 సార్లూ నేనే సీఎంగా ఉండటం నా అదృష్టమని చెప్పారు. సముద్రంలోకి వెళ్లే నీటిలో 300 టీఎంసీలు వాడుకుంటే కరవే ఉండదని అలానే పోలవరం పూర్తయితే నీటి సమస్యే ఉండదని తెలిపారు. పోలవరం నుంచి విశాఖకు అక్కడి నుంచి వంశధారకు తీసుకెళ్తామని రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వెల్లడించారు. గొడవలు పెట్టుకుంటే వచ్చే ప్రయోజనాలు ఏమీ ఉండవని సూచించారు. పెద్దపెద్ద నగరాలన్నీ నదుల పక్కనే ఉన్నాయి. దీనిపై వైఎస్సార్సీపీ నేతలు ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ఆఖరికి వైద్యకళాశాలలపైనా రాజకీయాలు చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సంక్రాంతి అంటే కోడిపందేలే కాదు.. తెలంగాణకు ఆంధ్రా ప్రేమను పంచండి



**మొదటిపేజీ తరువాయి –** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆంధ్రా పిండి వంటల స్టాళ్లను వారు పరిశీలించారు.అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... "సంక్రాంతికి తెలంగాణ సోదరసోదరీమణులను ఆహ్వానించి, వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యం రుచి చూపించాలి. పీఠికాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామాగా నిలవాలి" అని ఆకాంక్షించారు. సంక్రాంతి అంటే కేవలం కోడిపందేలు, జూదాలు కాదని, సంస్కృతీ సంప్రదాయాల కలయిక అని అన్నారు. సరదాలను కాదనడం లేదని, కానీ పండుగ ఆ ఒక్కదానికే పరిమితం కాకూడదని సూచించారు. పిఠాపురం అభివృద్ధిపై మాట్లాడుతూ... "ఏదైనా కూలగొట్టడం తేలిక, కానీ నిర్మించడం చాలా కష్టం. ఒక కూటమిని నిర్మించి, అందరినీ ఏకతాటిపై నడపడం అంత సులభం కాదు. నేను వ్యవస్థను బలోపేతం చేయడానికే వచ్చాను" అని అన్నారు. పిఠాపురంలో చిన్న సంఘటన జరిగినా దాన్ని పెద్దది చేసి వైరల్ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పిఠాపురంలో కాకి ఈక పడినా ఏదో జరిగిపోయిందని ప్రచారం చేస్తున్నారు. పిల్లలు కొట్టుకున్నా కులాలను అంటగడుతున్నారు. కానీ, పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు" అని విమర్శించారు. భగవంతుని సంకల్పంతోనే తాను శక్తిపీఠమైన పిఠాపురంలో పోటీ చేశానని, అధికారంతో సంబంధం లేకుండా తన చివరి శ్వాస వరకు ఈ ప్రాంత ప్రజల కోసం పనిచేస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తనను బలోపేతం చేస్తే మరింతగా పనిచేసే శక్తి వస్తుందని ఆయన తెలిపారు.

## జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం



**మొదటిపేజీ తరువాయి –** నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లు కావాలని చెబుతానని, అదే సమయంలో వివాదాలు కావాలా, పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని స్పష్టంగా చెబుతానని ఆయన అన్నారు.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేడుక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని, కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. అలా అడ్డంకులు కలిగిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని, పరిష్కారం మాత్రమే కోరుకుంటు న్నామని స్పష్టం చేశారు. తమకు కావలసింది రాజకీయ ప్రయోజనాలు కాదని, ప్రజల ప్రయోజనాలని అన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాల్సిందే అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక్క అడుగు ముందుకు వేస్తే తాము 10 అడుగులు ముందుకు వేస్తామని ఆయన అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు మన దేశానికి చెందిన వారే సీఈవోలుగా ఉన్నారని ఆయన తెలిపారు.

## తిరుమలలో రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు



**మొదటిపేజీ తరువాయి –** కలియుగ వైకుంఠం తిరుమలలో 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతంగా ముగిశాయి. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు సాగిన ఈ దర్శనాల్లో టీటీడీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీటీడీ కల్పించిన ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు.గత ఏడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో 6.83 లక్షల మంది, 2023లో 6.47 లక్షల మంది దర్శించుకోగా, ఈసారి ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఈ 10 రోజుల్లో శ్రీవారి హుండీ ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూరింది. రికార్డు స్థాయిలో 44 లక్షల లడ్డూలు విక్రయించామని చైర్మన్ వివరించారు. గతేడాదితో పోలిస్తే ఇది 10 లక్షల లడ్డూలు అధికం. అన్నప్రసాదాల వితరణ కూడా 27 శాతం పెరిగినట్లు తెలిపారు.పక్కా ప్రణాళిక, ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షించడం వల్లే అంచనాలకు మించి భక్తులకు దర్శనం కల్పించగలిగామని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. కల్యాణకట్ట, పారిశుద్ధ్యం, వైద్య సేవలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని చెప్పారు. 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లతో చేసిన అద్భుత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు."ఈ వైకుంఠ ద్వార దర్శనాలను శాంతియుతంగా విజయవంతం చేసిన భక్తులకు, అహర్నిశలు శ్రమించి మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బంది మరియు సేవకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

## టీటీడీని అభినందించిన సీఎం చంద్రబాబు




**మొదటిపేజీ తరువాయి –** అభినందనీయమని పేర్కొన్నారు.క్యూలైన్ల పర్యవేక్షణ,అన్నప్రసాదం అందించడం నుంచి భక్తులకు కల్పించిన ప్రతి సౌకర్యంలోనూ యంత్రాంగం తీసుకున్న జాగ్రత్తలు మంచి ఫలితాలను ఇచ్చాయని చంద్రబాబు కొనియాడారు. శ్రీవారి భక్తులు పూర్తి సంతృప్తి చెందేలా వైకుంఠ ఏకాదశిని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో, తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు భక్తులు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ట్రంప్‌కు మోదీ ఫోన్ చేస్తే డీల్ ఓకే



**మొదటిపేజీ తరువాయి –** దాల్చకపోవడానికి విధానపరమైన అడ్డంకులు కారణం కాదని ఆయన స్పష్టం చేశారు.అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడమే అసలు కారణమని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అసంతృప్తిగా ఉన్నానని, ఢిల్లీపై అధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ చేసిన వ్యాఖ్యల అనంతరం అమెరికా వాణిజ్య శాఖ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.మామూలుగా అయితే ఒప్పందం కొలిక్కి వచ్చిందని, ఇది ట్రంప్ ఒప్పందమని చెప్పవచ్చునని ఆయన అన్నారు. దానికి ముగింపు రావాలంటే ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదని, మోదీ ఫోన్ కూడా చేయలేదని ఆయన తెలిపారు.ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నామని, వాటి కంటే భారత్‌తోనే ముందు ఒప్పందం ఖరారవుతుందని భావించామని ఆయన అన్నారు. అలా జరగకపోవడంతో ఇంతకుముందు అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా వెనక్కి తీసుకుందని, ప్రస్తుతం దానిపై ఆలోచన చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు.బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వస్తోన్న సమయంలో ఆ దేశ ప్రధాని కీర్‌స్మార్టర్ ట్రంప్‌నకు ఫోన్ చేశారని ఆయన గుర్తు చేశారు. దాంతో అదే రోజు డీల్ ముగిసిందని, మరుసటి రోజు ఇరువురు నేతలు మీడియా సమావేశంలో ప్రకటన చేశారని తెలిపారు. మోదీ ఫోన్ చేయడానికి నిరాకరించినప్పటికీ, ఇంకా ఫోన్ చేయడానికి ఆయనకు అవకాశం ఉందని హోవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు.

## సికింద్రాబాద్ గుర్తింపును దెబ్బతీసే కుట్ర



**మొదటిపేజీ తరువాయి –** సికింద్రాబాద్‌కు ఉన్న ఘనమైన చరిత్రను, ప్రత్యేక గుర్తింపును దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పద్మారావునగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... సికింద్రాబాద్ అస్థిత్వం కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 11వ తేదీన బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తలసాని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ వాణిజ్య, వ్యాపార, కార్మిక సంఘాల నేతలు, కాలనీలు, బస్తీల కమిటీ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఈ నెల 17న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు.సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తలసాని హెచ్చరించారు. అవసరమైతే దశలవారీగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఇతర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన పోరాటం కాదని, సికింద్రాబాద్ ప్రాంత ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఉద్యమమని ఆయన పేర్కొన్నారు.ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా, సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని తలసాని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలు నియంతృత్వ ధోరణిని స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్ ప్రత్యేకతను కాపాడుకోవాలంటే ప్రజలంతా ఒక్కటై నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 'సీరియల్ ల్యాండ్ గ్రాబర్'



**మొదటిపేజీ తరువాయి –** ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కొందరు విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి తమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గండిపేట మండలం, మణికొండ లోని వర్సిటీ క్యాంపస్‌లో ఉన్న భూమిని కేటాయించిన ప్రయోజనా లకు వినియోగించడం లేదని, కాబట్టి దానిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులు ఇటీవల హీూచీఖఖ రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ చర్య వర్సిటీ భవిష్యత్తుకు ముప్పు కలిగిస్తుందని విద్యార్థులు కేటీఆర్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన ప్రకటన తర్వాత తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఓ విద్యార్థి నాయకుడు ఆరోపించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ సర్కారు 'సీరియల్ కిల్లర్' లాగా 'సీరియల్ ల్యాండ్ గ్రాబర్'గా మారిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే వర్సిటీ భూమిని అక్రమంగా చేజిక్కించుకోవాలని చూస్తోందని విమర్శించారు. తొలుత అగ్రికల్చర్ వర్సిటీ, ఆ తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవాలని చూసిందని గుర్తుచేశారు.దేశంలో మైనారిటీల రక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. తెలంగాణలో మైనారిటీ వర్సిటీ భూమిని కబ్జా చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఇదేనా మీ 'మొహబ్బత్ కీ దుకాణ్'?" అని నిలదీశారు. హీూచీఖఖ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తాము తిరిగి అధికారంలోకి వచ్చాక వర్సిటీ విస్తరణకు అవసరమైన నిధులు కేటాయిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## 'పున మార్గం' ఎఫెక్ట్...
## 63 మంది మావోయిస్టుల లొంగుబాటు




**మొదటిపేజీ తరువాయి –** వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి.లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.

# ఓసిలకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలి

**ఓసి జేపీసీ నేతలు కిషన్ రెడ్డి, మహంకాళి రాజన్న, సిరిసిల్ల రాజేంద్ర శర్మ**

**ఓసి ల సింహ గర్జన సభ సక్సెస్ కోసం జగిత్యాలలో బైక్ ర్యాలీ**



**జగిత్యాల జనవరి 9 ( ప్రజా మంటలు) :** ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసి ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, ఓసి జేపీసీ జగిత్యాల జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మహంకాళి రాజన్న లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.జనవరి 11నవరంగల్ లోలక్ష మందితో నిర్వహించ తలపెట్టిన ఓసి ల సింహగర్జన సభవిజయవంతం చేయడానికి గాను శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓసి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.జగిత్యాల టౌన్ హల్ నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ టవర్ సర్కిల్, మార్కెట్, పాతబస్టాండ్, తహసీల్ చౌరస్తా, యావర్ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు సాగింది. రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న, కో కన్వీనర్లు కోప్పెర వెంకట్ రెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ లు ప్రసంగిస్తూ...ఈడబ్లూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 ఏళ్ల కాలపరిమితి కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితి పెంచాలని, ఈడబ్లూఎస్ వారికి కేటాయించిన మిగిలి పోయిన బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి వార్షిక ఆదాయ పరిమితి 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ రాత పరీక్ష అర్హతకు 90 మార్కుల నుంచి 70 మార్కులకు తగ్గించాలని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరారు.తమ డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్ళేందు కోసం ఈనెల 11 న సాయంత్రం 3 గంటలకు హన్మకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్ లో లక్ష మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి "ఓసి ల సింహగర్జన" భారీ బహిరంగ సభకు ఓసి లంతా రాజకీయాల కతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐకాస నాయకులు పిలుపు నిచ్చారు.మోటారు సైకిల్ ర్యాలీలో నాయకులు మోతే ఉమాపతి శర్మ,ఎన్నం రాంరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, దేవరశెట్టి జనార్దన్, మందల గోపాల్ రెడ్డి,ఉత్తూరి గంగాధర్, అయిల్నేని స్వప్న,సంత గౌతమ్ రెడ్డి, సిరిసిల్ల వేణుగోపాల్,బండారి చంద్రశేఖర్, నూనె శ్రీనివాస్, కరండ్ల మహేష్, బొల్లం పాపన్న, యాంసాని శ్రీనివాస్, సంతోష్, సూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంట చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్






**జగిత్యాల జనవరి 9 ( ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారుల ఉపాధి కోసం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లో భాగంగా జగిత్యాల జిల్లా మత్స్య శాఖ వారి ఆద్వర్యం లో జగిత్యాల పట్టణ చింత కుంట చెరువు లో 22వేల చేప పిల్లలను వదిలిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మోతే మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలవగా మహిళా సహకార సంఘం సభ్యులను అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**ఎమ్మెల్యే మాట్లాడుతూ**

చెరువుల రక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది..

చెరువుల రక్షణ లో మత్స్య సహకార సొసైటీ ల పాత్ర కూడా చాలా కీలకం....

చెరువుల దగ్గర ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ల ను కాపాడే బాధ్యతజ అందరి పై ఉంది.

గొలుసు కట్టు చెరువుల ఆక్రమణ తో నేడు ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.

అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు.

చెరువు కట్ట ప్రాంతం లో రైతులు కూడా కొంత భూమి విడిచి సాగు చేయాలి అప్పుడే కట్ట దెబ్బతినకుండా ఉంటుంది...

హైదరాబాద్ లో హైడ్రా తో అక్రమార్కుల పని పడుతున్నారు.

గతం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆద్వర్యం లో చెరువుల మీద పూర్తి హక్కులను గంగపుత్రులు ముదిరాజ్ లకు కల్పించింది.

గంగ పుత్రుల రక్షణ కు సేఫ్టీ జాకెట్ లు, వ్యాపారానికి మోపెడ్ లు, బోట్ లు, టాటా ఏ సి లు,వలలు ప్రభుత్వం అందజేస్తుంది.

బీట్ బజార్ మార్కెట్ లో చేపల మార్కెట్ అభివృద్ధి చేయటం జరిగింది త్వరలో ప్రారంభం అవుతుందని అన్నారు....

జిల్లా వ్యాప్తం గా 89 మహిళా సహకార సంఘాలు ఉంటే జగిత్యాల లో 10 ఉన్నాయి...

గంగ పుత్రులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి..

మార్కెటింగ్ ,మహిళా భాగస్వామ్యం ద్వారానే లాభాలు పొందడానికి అవకాశం ఉందని అన్నారు.

గత ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఈ ప్రభుత్వం ప్రతి నెల 6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తుంది అని సంక్షేమ పథకాలు కొనసాగిస్తుంది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి సురేష్ బాబు,మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్,నాయకులు అడువల లక్ష్మణ్,మాజీ కౌన్సిలర్ లు బాలె శంకర్, మేక పద్మావతి పవన్, ఎఫ్ సి ఎస్ అధ్యక్షులు గుమ్మల అంజయ్య,కార్యవర్గ సభ్యులు రాజేశం, మోతే నాయకులు జుంబర్తి శంకర్,ఆరుముల్ల శంకర్,పట్టణ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క సారలమ్మ దర్శించుకున్న జర్నలిస్టు రఘు నాథ్ రెడ్డి



**చిగురుమామిడి జనవరి 09 (ప్రజా మంటలు) :** కుటుంబ సభ్యులతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మకు కుటుంబ సభ్యుల ఎత్తు బంగారం సమర్పించి మేడారంలో మొక్కులను అప్పజెప్పిన సీనియర్ జర్నలిస్ట్ లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి ఈ సంవత్సరం సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి కొరకై తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగలి శ్రీనివాస్ రెడ్డి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ల సహకారంతో స్థానిక ఎమ్మెల్యే మంత్రి సీతక్క కోట్లాది రూపాయల నిధులతో సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం తోపాటు మేడారంలో పలు చౌరస్తాల సుందరీకరణ అభివృద్ధిలతో పాటు స్వాగత తోరణాలు దేవాలయ ప్రాంగణంలో గోవిందరాజు పైడిదరాజుల గద్దెల నిర్మాణాన్ని సైతం నూతనంగా చేపట్టారు నూతన డబలు రోడ్లు సెంట్రల్ లైటింగ్ సిస్టం తో పాటు రోడ్డుకి ఇరువైపులా జాతర మొత్తం చుదునుచేసి లైటింగ్లను మౌలిక వసతులను ఏర్పాటు చేశారు గత నెల రోజుల నుండి పనులను ప్రారంభించిన ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ఒకవైపు పనులు మరోవైపు దర్శనాలను కొనసాగిస్తున్నారు ఈ సంవత్సరం అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేయగా నీటి వసతి ఒకటి వెలితే కనబడుతుంది జంపన్న వాగుల నీరు నిల్వ లేకపోవడంతో భక్తుల స్నానాల కు ఇబ్బందులు పడుతున్నారు దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఈనెల చివరి జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మహాకుంభమేళా కి లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మ వార్ల ని దర్శించుకుంటారు కాబట్టి అధికారులు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని సీనియర్ జర్నలిస్టు లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు మేడారం మహా జాతరకు కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేసిన ప్రభుత్వానికి సీఎంకి మంత్రులకి అభినందనలు భక్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు అనంతరం ఆలయ కోయ పూజారులు రఘునాథ్ రెడ్డి కుటుంబాన్ని అమ్మవార్ల కండువాచే సన్మానించి ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు.

# మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్

**నిషేధిత చైనా మాంజా అమ్మకం, వినియోగంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు**

**మెట్పల్లి జనవరి 9 (ప్రజా మంటలు) :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలను, రిజిష్టర్ లను పరిశీలించి, రికార్డులన్నీ తనఖీ చేశారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ, వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన ఆక్సిడెంట్ జోన్ లుగా, బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.సంక్రాంతి పండుగ సమయంలో చాలా మంది తమ స్వగ్రామాలకు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లడం వల్ల ఇండ్లు ఖాళీగా ఉండే అవకాశముందని, ఈ పరిస్థితిని దొంగలు తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశముంటుందని కావున ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

**నిషేధిత చైనా మాంజా అమ్మకం, వినియోగంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు**

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (నైలాన్ / సింథటిక్ దారాలు)ను విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, చైనా మాంజా విక్రయాలు, రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజా వల్ల మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. నైలాన్,సింథటిక్ దారాలు పర్యావరణానికి, పక్షులకు, మనుషులకు తీవ్రమైన హానిని కలిగిస్తాయని, గతంలో అనేక ప్రమాదాలు, ప్రాణనష్టాలు సంభవించిన దృష్ట్యా జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా చైనా మాంజాను అమ్మినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా సంబంధిత సమాచారం ఉంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు, మెట్ పల్లి సి.ఐ అనిల్ కుమార్, ఎస్.ఐ కిరణ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## గురుకుల విద్యార్థి విగ్నేష్ అథ్లెటిక్ లో రాష్ట్ర స్థాయి ఎంపిక



**గొల్లపల్లి జనవరి 09 ప్రజా మంటలు :** గొల్లపెల్లి మండల కేంద్రం గురుకుల (మగ్గిడి ) శేఖల్ల గ్రామానికి చెందిన విగ్నేష్ ఈ నెల మెట్టుపల్లి లో ఈ నెల 4న జిల్లా స్థాయి అథ్లెటిక్‌లో ఖ -12, 400 మీటర్ పరుగు పందెం లో ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక ఆయన సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ జి ,రమేష్ వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, కల్పన శేఖల్ల గ్రామ ప్రజలు అభినందించారు.

## చైనా మాంజా దారాలతో పతంగి ఎగురవేయవద్దు



**ఇబ్రహీంపట్నం జనవరి 9( ప్రజా మంటలు దగ్గుల అశోక్ :** జగిత్యాల జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాను సారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎస్సై ఏ అనిల్ పలు కిరాణా షాపులు , దుకాణాలలో నిషేధిత చైనా మాంజా గురించి తనిఖీలు నిర్వహించడం అయింది , చైనా మాంజా అమ్మినచో కేసులు నమోదు చేసి చట్టపనమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించడం అయినది. ఎవరు కూడా చైనా మాంజా దారాలతో పతంగి ఎగురవేయవద్దు.

## ఆదర్శ పాఠశాల లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



**గొల్లపల్లి జనవరి 09 ప్రజా మంటలు :** ధర్మారం ఆదర్శ పాఠశాల ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో అన్ని తరగతులకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు మన తెలంగాణ సాంప్రదాయ ఉట్టిపడేలా పాఠశాలలోనే బోనం చేయటం, సహజమైన రంగులతో ముగ్గులు వేయటం, గోమాతకు పూజ చేయటం,భోగిమంటలు,పతంగులు ఎగురవేయడం, పిండివంటలు చేయటం ఇలా పలు రకాల కార్యక్రమాలు తద్వారా విద్యార్థులందరికీ సంప్రదాయ ప్రాముఖ్యత తెలియటం తో పాటు సామాజిక పరమైన విలువలు ఐక్యత పెంపొందుతుంది అని వివరించారు.విద్యార్థులు వేసిన హరిదాసు వేషాలు,గోమాత పూజ సన్నాయి మేళం అందరిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీరవేణి రాజ్ కుమార్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం కేజీబీవీ లో మధ్యాహ్న భోజనం రికార్డుల పరిశీలన.



**ఇబ్రహీంపట్నం జనవరి 9( ప్రజమంటలు దగ్గుల అశోక్ ):** మెట్టుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం శివారులోని 2 దీంఖ వెనకాల గల స్థలంలో నివేషణ స్థల పట్టాల కొరకు దరఖాస్తు చేసుకున్న అర్జీ ల పై విచారణ చేయడం జరిగినది. జగిత్యాల కలెక్టర్ ఆదేశంలో మేరకు శుక్రవారం రోజున కేజీబీవీ ఇబ్రహీంపట్నం నందు మధ్యాహ్న భోజనము, రికార్డులను పరిశీలించి పిల్లలతో భోజనం చేయడం జరిగినది.

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసిన టీఎన్జీవో నాయకులు



**జగిత్యాల జనవరి 9( ప్రజా మంటలు) :** టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ఉద్యోగులకు సంబంధించిన వివిధ పెండింగ్ సమస్యల గురించి చర్చించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ టీఎన్జీవో ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగుల సమస్యలేమి ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా నాయకులు సాహెబ్ బాబు, రవీందర్, రాజేశం, సుగుణాకర్, మమత, రాజశ్రీ, భాగ్య, లావణ్య, అరుణ, నారాయణ, సతీష్, కె.భాగ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

## శాసనసభ కార్యదర్శి తిరుపతిని అభినందించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే



**హైదరాబాద్, జనవరి 09 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ భవనంలోని శాసన కార్యదర్శి తిరుపతి ఛాంబర్‌లో మాజీ మంత్రి, తెలంగాణ తొలి ఆర్థిక సంఘం చైర్మన్ జి. రాజేశం గౌడ్, మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, అంజనేయులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి మర్యాదపూ ర్వకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, శాసనసభ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తిరుపతిని వారు అభినందించారు. శాసనసభ కార్యకలాపాల నిర్వహణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధిలో శాసనసభ పాత్రపై స్నేహపూర్వకంగా చర్చించారు.ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సానుకూలంగా కొనసాగిందని సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.

## గోరుమంతుల ప్రభాకర్ కుటుంబానికి మెట్‌పల్లికోరుట్ల బార్ అసోసియేషన్ల ఆర్థిక సహాయం



**మెట్‌పల్లి, జనవరి 9 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు గోరుమంతుల ప్రభాకర్ ఇటీవల మరణించడంతో, ఆయన కుటుంబ సభ్యులకు సహాయంగా మెట్‌పల్లి మరియు కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయ నిధులను సమీకరించి శుక్రవారం కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా మెట్‌పల్లి, కోరుట్ల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, బైరి విజయ్ కుమార్ మాట్లాడుతూ, మెట్‌పల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదులు రూ.1,60,000/- మరియు కోరుట్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు రూ.77,500/- మొత్తం రూ.2,37,500/-ను సేకరించి, ఆ మొత్తాన్ని కుటుంబ భవిష్యత్తు కోసం బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి ఆకుల మానస, క్రీడా కార్యదర్శులు బిగుల్లా శంకర్, సుతారి నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు కట్టా నర్సాగౌడ్, మన్నె గంగాధర్, గజభీంకర్ వెంకటేష్, ఊరడి నరేందర్, రాసభక్తుల రాజశేఖర్‌తో పాటు న్యాయవాదులు బర్ల సంతోష్, వంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు రాయికల్ మండల మాజీ ప్రజాప్రతినిధుల మద్దతు



**రాయికల్, జనవరి 09 (ప్రజా మంటలు) :** రాయికల్ మండల మాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్ ఆధ్వర్యంలో, మండలంలోని కుమ్మరిపల్లి, కొత్తపేట, కిష్టంపేట గ్రామాలకు చెందిన తాజా మాజీ ఎంపీటీసీలు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను, ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి పూర్తి మద్దతుగా నిలుస్తామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే గారు బలపరిచే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. అలాగే, రాయికల్ మండల అభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు నాగరాజు, మందుల శ్రీనివాస్, జాన గంగాధర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మోఖీద్, మండల నాయకురాలు స్పందన, సర్పంచ్ మల్లేశం, సాగర్ రావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు ప్రారంభించిన కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 09 (ప్రజా మంటలు) :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలను ప్రారంభించారు. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.స్థానిక పరిస్థితులు, పార్టీ బలాబలాలు, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని, ప్రతి మున్సిపాలిటీలో పార్టీని గెలుపు దిశగా నడిపించేలా సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు. పార్టీ శ్రేణులు ఏకమై ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేష్తో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అరగుండాల ప్రాజెక్టుతో రైతుల ముఖాల్లో చిరునవ్వులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి




**బీర్పూర్, జనవరి 09 (ప్రజా మంటలు) :** బీర్పూర్ మండలంలోని అరగుండాల ప్రాజెక్టు ముత్తడి ప్రాంతాన్ని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల ప్రాజెక్టు స్లూయిస్ గేట్ దెబ్బతినడంతో పాటు కాలువ మరమ్మత్తుల అవసరాన్ని రైతులు తన దృష్టికి తీసుకురా వడంతో, జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో చర్చించి తక్షణ చర్యలు చేపట్టించినట్లు తెలిపారు. ఎస్సారెస్పీ మొదటి విడత సాగునీటి విడుదలను రెండు రోజులు పొడిగించడంతో అరగుండాల ప్రాజెక్టుకు నీరు చేరి నిండు కుండలా కనిపిస్తోందని చెప్పారు. అలాగే కాలువ మరమ్మత్తుల కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించామని వెల్లడించారు. దీంతో ఈ వేసవి రబీ పంటపై ఆధారపడిన రైతుల్లో ఆశలు చిగురించాయని అన్నారు.మంగేళకమ్మునూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్లు కాపర్ వైర్ దొంగతనానికి గురైన విషయం మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, రూ.20 లక్షల నిధులతో వారం రోజుల్లో మరమ్మత్తులు చేపడతామని తెలిపారు. కొల్వాయి లిఫ్ట్ ఇరిగేషన్ సంపులో పేరుకుపోయిన ఇసుక తొలగించి, త్వరలో నీటి విడుదల ప్రారంభిస్తామని చెప్పారు.రోళ్లవాగు గేట్ల బిగింపు పనులు కూడా జనవరి చివరిలోగా పూర్తి చేసి, ఎగువదిగువ ప్రాంతాల గ్రామాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామని జీవన్ రెడ్డి తెలిపారు. బీర్పూర్ మండలంలోని ప్రతి ఎకరానికి నీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతాంగానికి పూర్తి భరోసా ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

## గంజాయితో పట్టుబడిన యువకుల పై కేసు నమోదు

**గొల్లపల్లి జనవరి 09 ప్రజా మంటలు :** ధర్మపురి మండలంలో గంజాయితో వెళుతున్నాడ ని నమ్మదగిన సమాచారం మేరకు ధర్మపురి శివారులో కమలాపూర్ రోడ్డు పోలీసులు వాహనాల తనిఖీలో యువకుడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతనీ వద్ద నుండి 129 గ్రాముల గంజాయి లభించగా వివరాలకు వెళ్తే ధర్మారం మండలానికి చెందిన దుర్గాప్రసాద్ ను విచారించగా మంచిర్యాల కు చెందిన కంద్ర కొండ వెంకటేష్ దగ్గర తీసుకున్నట్లు తెలిపారు ధర్మపురి పోలీసులు కంద్ర కొండ వెంకటేష్ ను అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్రలోని గుర్తుతెలియని వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తాన ని తెలుపుగా ఇద్దరు యువకుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి,మహేష్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సిక్ రూంల నిర్వహణ

**ప్రాథమికంగా 629 పాఠశాలల్లో ఏర్పాటు**

**పాఠశాలల్లో అత్యవసర వైద్య సహాయం అందించే లక్ష్యంతో ఆరోగ్య నిర్వహణ (సిక్) గదుల ఏర్పాటు**

**మార్చి చివరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సమగ్ర శిక్ష అభియాన్ చర్యలు**



ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య నిర్వహణ (సిక్) గదులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రాథమిక వైద్య సహాయాన్ని అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మార్చి నెల చివరి నాటికి ప్రత్యేక గదుల ఏర్పాటు, వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సమగ్ర శిక్ష అభియాన్ చర్యలు చేపట్టింది.ఒక్కో ఆరోగ్య నిర్వహణ గది ఏర్పాటుకు రూ.5 లక్షల ఎస్ఎస్ఏ నిధులు : పాఠశాలలో పెద్దగా ఉండే ఒక తరగతి గదిని రెండుగా విభజించి, సగం గదిని సిక్ రూమ్‌గా మార్పు చేస్తారు. రాష్ట్రంలో 629 పీఎంశ్రీ పాఠశాలల్లో మొదటిగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సిక్ రూమ్‌ల నిర్వహణకు పాఠశాల సిబ్బంది, ఆరోగ్య నిపుణులు, తల్లిదండ్రులతో ఆరోగ్య కమిటీని ఏర్పాటు చేస్తారు. స్థానిక ఆసుపత్రుల సహకారంతో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒత్తిడి, ఆందోళన లాంటి సమస్యలు పరిష్కరించేందుకు శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల సేవలు వినియోగించుకుంటారు. సబ్బుతో చేతులు కడుక్కునేందుకు స్టేషన్లు, మరుగుదొడ్లు, సురక్షిత తాగు నీరు, శానిటరీ ప్యాడ్లను అందుబాటులో ఉంచుతారు. ఒక్కో ఆరోగ్య నిర్వహణ గది ఏర్పాటు కోసం రూ.5 లక్షల చొప్పున ఎస్ఎస్ఏ (సాూూ) నిధులు విడుదల చేసింది.అవగాహన కార్యక్రమాలు – టెలీమెడిసిన్ హాట్‌లైన్ : పాఠశాల స్థాయిలో పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, నెలసరి పరిశుభ్రత, అనారోగ్యాలపై అవగాహన శిబిరాలను నిర్వహిస్తారు. ఆరోగ్య విద్య పుస్తకాలు అందిస్తారు. ఆరోగ్యానికి సంబంధించిన వీడియోలను తయారు చేసి, అందిస్తారు. స్థానిక ఆసుపత్రులతో కలిసి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి విద్యార్థి డిజిటల్ ఆరోగ్య ప్రొఫైల్ రూపొందిస్తారు. గాయాలు, ఎలర్జీ లాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితులపై మాక్‌డ్రిల్లులు నిర్వహిస్తారు. టెలీమెడిసిన్ హాట్‌లైన్ ద్వారా అత్యవసర సంప్రదింపుల సౌకర్యం కల్పిస్తారు.పాఠశాల స్థాయిలో ఆరోగ్య నిర్వహణను బలోపేతం చేసేందుకు సిక్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలుపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులకు బడుల్లో ప్రాథమిక వైద్యం అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. స్థానిక ఆసుపత్రుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు బి.శ్రీనివాసరావు వివరించారు.ఇదిలా ఉండగా మరోవైపు బడి పిల్లల ముఖాల్లో కొత్త కళ తీసుకువచ్చేందుకు, వారిలో పరిశుభ్రతను ఒక జీవనశైలిగా మార్చేందుకు 'ముస్తాబు' అనే వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. గత నెల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం అమల్లోకి తీసుకువచ్చిన విషయం విదితమే.పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు నేర్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. ప్రతి తరగతి గదిలో, హాస్టల్ గదిలో ఒక 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేస్తారు. ఇది ఒక చిన్నపాటి డ్రెస్సింగ్ రూమ్ లాంటిది. ఇక్కడ గోడకు ఒక అద్దం ఉంటుంది. అక్కడ దువ్వెన, తువ్వాలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్ వాష్, నీళ్ల బకెట్ అందుబాటులో ఉంచుతారు.

# క్యూలైన్లలో ఫ్యాన్లు - నిమిషాల్లోనే దర్శనం

**మేడారంలో ఈసారి ఇబ్బందులుండవ్!**

**మేడారం జాతరకు ముమ్మరంగా అభివృద్ధి పనులు**

**సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు**

**లైన్లలో వేచి ఉండే భక్తులకు ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం**

**20 నిమిషాల వ్యవధిలోనే దర్శనం**



మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటుతోంది. సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. అయితే మన రాష్ట్రం నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి భక్తులు రావడంతో దానికి అనుగుణంగానే ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం భక్తుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించింది.వన దేవత సమ్మక్క, సారలమ్మ మహా జాతరలో భక్తుల కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. దేవతల దర్శనం పూర్తయిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈసారి క్యూలైన్ల నిర్మాణం వినూత్నంగా చేపడుతున్నారు. పది నుంచి ఇరవై నిమిషాల వ్యవధిలోనే దర్శనం జరిగేలా రూ.3 కోట్లతో జరుగుతున్న క్యూలైన్ల నిర్మాణంపై ప్రత్యేక కథనం.ఇంత వరకు జాతర గద్దెల ప్రాంగణానికి కుడి, ఎడమ, వెనక వైపు క్యూలైన్లు ఉండేవి. కాగా ఈసారి కుడి వైపున్న వరుసలను తొలగించి స్మృతివనం నిర్మిస్తున్నారు. ఎడమ వైపు ఉన్న వాటన్నింటిని తొలగించారు. మొత్తం ఐదు వరుసలను నిర్మిస్తున్నారు. ఈ వరుసల్లో ప్రవేశించిన భక్తులు సమారు 750 మీటర్లు నడిచి, గద్దె ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్య వరుసను పోలీసులు, వాలంటీర్ల కోసం వినియోగిస్తారు. దానికి కుడి వైపు ఉన్న రెండు, ఎడమ వైపు ఉన్న రెండు వరుసల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తారు.వీటిపై నీడ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో షెడ్లు నిర్మిస్తున్నారు. లైన్లలో వేచి ఉండే భక్తులు ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. గతంలో భక్తులు ఒక వరుస నుంచి మరో వరుసలోకి వెళ్లేందుకు ఇనుప బొంగుల మధ్య కొంత స్థలం ఉండేది. ఈసారి అలాంటి అవకాశం లేకుండా ఏర్పాట్లు చేశారు.దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల గవర్నలు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులతో పాటు రాష్ట్రానికి చెందిన వేలాది మంది ప్రముఖులు దేవతలను దర్శించుకొనేందుకు మహా జాతరకు వస్తుంటారు. వీరందరికీ వీఐపీ దర్శనం అందేలా చేయడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. గతంలో వీఐపీల కోసం ప్రత్యేకంగా ఒక వరుస ఉండగా, పైరవీల కారణంగా తొలగించారు. ఈసారి మాత్రం మాస్టర్ ప్లాన్‌లో ప్రత్యేకంగా వీఐపీ వరుసను పక్కాగా ఏర్పాటు చేస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న సాయంత్రం మేడారం వెళ్లనున్నారు. తర్వాత రోజు ఉదయం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క ఇదివరకే వివరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల సమీక్షకు హాజరైన మంత్రులు పలు వివరాలను వెల్లడించారు. రూ.251 కోట్లతో జాతర ఏర్పాట్లు, సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం జరుగుతోందని, పనులు తుది దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు సీతక్క, కొండా సురేఖలు గురువారం ఆహ్వానించారు. ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మంత్రులను కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. మంత్రులు జాతర ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. తమ ఇంటికి విచ్చేసిన మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. కేసీఆర్ - శోభ దంపతులు పసుపు, కుంకుమ, తలంబ్రాలు, వస్త్రాలతో సంప్రదాయ రీతిలో మంత్రులను సత్కరించారు. వారు అందించిన విందును స్వీకరించిన మంత్రులు, పరస్పర యోగాక్షేమాలు తెలుసుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు.

# 450 ఏళ్ల ఘన చరిత్ర

**కోనసీమ ప్రభల తీర్థానికి రాష్ట్ర పండగ హోదా**

**జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగగా గుర్తింపు**

**మంత్రి దుర్గేష్, సృజనాత్మక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని వెల్లడి**



తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగకు పెట్టింది పేరు గోదావరి జిల్లాలే. సంక్రాంతి అంటే రంగవల్లులు, పిండి వంటలు, భోగి మంటలు, కోడి పందాలు మాత్రమే కాదు. వీటితో పాటు కోనసీమ వాసులు కనుమ పండుగ రోజున జరుపుకొనే ప్రభల తీర్థం గురించీ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. మరీ ముఖ్యంగా జగ్గన్నతోటలో ప్రతీ ఏడాది నిర్వహించే ప్రభల తీర్థానికి లక్షల సంఖ్యలో జనం తరలివస్తుంటారు. వీటికి 450 ఏళ్లు ఘన చరిత్ర ఉంది. ఇంతటి విశిష్టత ఉన్న జగ్గన్నతోట ప్రభల తీర్థం వేడుకలను రాష్ట్ర పండగగా నిర్ణయించారు. మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా నిర్ణయించారు. ఈ మేరకు మంత్రి మండలి నిన్న (గురువారం) నిర్ణయం తీసుకుంది. ఇది మన సంస్కృతికి దక్కిన గౌరవం అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సృజనాత్మక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని పేర్కొన్నారు. సచివాలయంలో గురువారం వారిద్దరూ మాట్లాడారు.

**450 ఏళ్ల ఘన చరిత్ర – కోనసీమ ప్రభల తీర్థానికి రాష్ట్ర పండగ హోదా**

'జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాచీన సంప్రదాయం. 450 ఏళ్లుగా ఈ తీర్థాన్ని ఏటా సంక్రాంతి పండుగలో కనుమ రోజు ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలు చూసేందుకు 5-6 లక్షల మంది హాజరవుతారని అంచనా. ఏకాదశ రుద్రులు 11 గ్రామాల నుంచి బయలుదేరి జగ్గన్నతోటలో ఆ రోజు కొలువు దీరతారని, వారు అక్కడ ప్రజాక్షేమం కోసం చర్చించుకుంటారు అనేది కోనసీమ వాసుల నమ్మకం.ఈ 11 గ్రామాలతో పాటు ఇతర పల్లెలు, ప్రాంతాల నుంచి అనేక ప్రభలు జగ్గన్నతోటకు చేరుకుంటాయి. ఇప్పటికీ పాత సంప్రదాయం ప్రకారమే అధిక బరువు ఉండే ప్రభలను మోసుకుంటూ పొలాలు, తోటలు, కౌశిక నదిని దాటుకుంటూ అక్కడికి చేరుస్తారు. ఈ తీర్థం నిర్వహణను గతంలో ప్రధాని మోదీ ప్రస్తావించారు. రిపబ్లిక్ పరేడ్‌లో కూడా ఈ తీర్థం విశిష్ఠతను ప్రదర్శించిన విషయం తెలిసింది.ఇప్పుడు రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేయనుంది. ప్రజలంతా ఈ తీర్థాన్ని సందర్శించాలి అని తేజస్విని కోరారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కోనసీమ యావత్తూ ప్రభల తీర్థాన్ని పెద్ద పండుగగా చేస్తారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వాటిని గుర్తించి, ప్రాధాన్యం కల్పిస్తోందని ఆయన అన్నారు. కోనసీమలోని పర్యాటక ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.'ఏకాదశ రుద్రులు ప్రభలు ఒకేసారి బయలుదేరి జగ్గన్నతోట ప్రాంతంలో ప్రభల తీర్థం జరుగుతోంది. కనుమ రోజున కోనసీమ అంతంటా అద్భుతమైన పండగ వాతావరణం నెలకొంటోంది. ప్రభల ఉత్సవాలు చేయడం వల్ల గ్రామంలో పంటలు బాగా పండుతాయని కోనసీమ వాసుల నమ్మకం.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహిస్తున్న జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మలికిపురం గ్రామానికి మంగళవారం వచ్చిన ఆయనకు స్థానికులు వినతి పత్రం ఇవ్వగా ఈ మేరకు స్పందించారు.లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ఏటా వైభవంగా నిర్వహించే ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘన చరిత్ర ఉందని, ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, తాను వేర్వేరు సందర్భాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లామని దుర్గేష్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.కనుమ పండుగ రోజున కోనసీమలో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా జరపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కోనసీమలో 450 ఏళ్ల నుంచి ప్రభల తీర్థం వేడుకలు ఘనంగా జరుగుతున్నా గత ప్రభుత్వాలు ఈ వేడుకలను ప్రభుత్వ పండుగగా గుర్తించలేదని అన్నారు.జగ్గన్నతోట ప్రభల తీర్థం వేడుకల ప్రాధాన్యత, సంస్కృతి సాంప్రదాయాలను గుర్తించిన ప్రభుత్వం ప్రభుత్వ పండుగగా జరపాలని నిర్ణయించినందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం గొప్ప వరమని సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని తెలిపారు.

# శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం

**రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేత**

**శ్రీవారి మెట్టు మార్గంలో 400వ మెట్టు వద్ద చిరుత సంచారం**

**గమనించిన భక్తులు వెంటనే అధికారులకు సమాచారం అందించిన వైనం**

**భద్రతా చర్యగా నడక మార్గాన్ని తాత్కాలికంగా మూసివేసిన టీటీడీ**

**భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు**



తిరుమల శ్రీవారి మెట్టు నడక మార్గంలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. ఈ మార్గంలోని 400వ మెట్టు సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు కొందరు భక్తులు గుర్తించి, వెంటనే టీటీడీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో భద్రతా సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు శుక్రవారం ఉదయం శ్రీవారి మెట్టు మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మార్గం మొత్తం విస్తృతంగా తనిఖీలు చేపట్టి, చిరుత కదలికలు లేవని నిర్ధారించుకున్న తర్వాత భక్తులను తిరిగి అనుమతించారు. ఈ నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా కాకుండా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, భక్తులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.గత కొంతకాలంగా అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం తరచుగా నమోదవుతుండటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే టీటీడీ ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘాను పటిష్ఠం చేసింది. రాత్రి వేళల్లో భక్తులను గుంపులుగా అనుమతించడం, అటవీ ప్రాంతాల్లో ఆహార పదార్థాలు పడేయవద్దని సూచించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

# లిక్కర్ రాణి కవిత ఖబర్దార్..

**టిఆర్పి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగే రజిత..**



**మెట్టుపల్లి జనవరి 9 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** జగిత్యాల జిల్లా మెట్ పల్లిలోని తన నివాసంలో టిఆర్పి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగె రజిత మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల కల్వకుంట్ల కవిత బ్యాచ్ పై మండిపడ్డారు. మీ అయ్య కేసీఆర్ తెలంగాణ ప్రజలను తాగుడికి బానిస చేస్తే దానికి నువ్వు రాణిగా ఉన్నందున ప్రజలు లిక్కర్ రాణి అని బిరుదు ఇచ్చారని గుర్తు చేశారు.బిసి ప్రజలకు డబ్బులు వెధజల్లి తీన్మార్ మల్లన్న పై ఉసిగొలిపి పైశాచిక ఆనందం పొందుతున్నావని అన్నారు.రానున్నది బీసీల రాజ్యమే దానికి ముఖ్యమంత్రి తీన్మార్ మల్లన్న గుర్తుపెట్టుకో కవిత ఒళ్ళు జాగ్రత్త పెట్టుకొని మాట్లాడమని మీ కార్యకర్తలకు చెప్పమని రజిత హెచ్చరించారు.

# ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యేను నిధులు కోరిన అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు



**జగిత్యాల జనార్ 9 (ప్రజా మంటలు) :** జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసిన జగిత్యాల పట్టణ అరవింద్ నగర్ అభయాం జనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు. రానున్న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని కోరిన ఆలయ కమిటీ సభ్యులు.ఈ కార్యక్రమంలో నాయకులు అడువల లక్ష్మణ్ కొత్త మోహన్ వీరబత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్ లో అక్షరాభ్యాసం గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలి,



**ఇబ్రహీంపట్నం జనవరి 9(ప్రజ మంటలు దగ్గుల అశోక్ ) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ మాట్లాడుతూ. అన్నము ఆకలిని తీరిస్తే అక్షరాభ్యాసం అజ్ఞానపు చీకట్లను తొలగిస్తుందని అన్నారు. పిల్లల్లో ఎదుగుదల కోసం అంగన్వాడి సెంటర్లలో అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్,అంగన్వాడీ టీచర్లు, ఆశలు. గర్భిణీలు, బాలాంతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# నిషేధిత చైనా మాంజా విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు



**జగిత్యాల, జనవరి 9 (ప్రజా మంటలు) :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిషేధిత చైనా మాంజా (నైలాన్ / సింథటిక్ దారాలు) విక్రయాలు జరగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది.ఈ తనిఖీల్లో భాగంగా పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని గాలిపటాల దుకాణాలు, స్టేషనరీ షాపులు, తాత్కాలిక విక్రయ కేంద్రాలను విస్తృతంగా పరిశీలించారు. నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా లేదా రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.చైనా మాంజా వల్ల ప్రజలకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, చిన్నారులకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా పక్షులకు గాయాలు, ప్రాణనష్టం కలగడంతో పాటు పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు, ప్రాణనష్టాల దృష్ట్యా చైనా మాంజా వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని వివరించారు.ప్రజలు నిషేధిత చైనా మాంజాను కొనుగోలు చేయకుండా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ ఉంచినట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎంఐఎం సెక్యులర్ పార్టీ జిల్లాలో అత్యధిక స్థానాలే గోల్.


**జిల్లా అధ్యక్షుడు - కాజా లియాఖత్ అలీ మొహసిన్.**



**జగిత్యాల జనవరి 9(ప్రజా మంటలు) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎంను బలోపేతం చేసి అత్యధిక స్థానాలు సాధించడం లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు కాజా లియాఖత్ అలీ మొహసిన్ శుక్రవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మీడియా సమావేశం తెలిపారు.ఎంఐఎం పార్టీ సంపూర్ణ సెక్యులర్ సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్న పార్టీ అని, ఆ పార్టీ పతాకం కింద జిల్లాలో సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ, యాసర్ అర్ఫాత్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహమ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో పార్టీ శక్తిని ప్రదర్శిస్తూ, అధిక సంఖ్యలో స్థానాలను గెలుచుకునేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కేవలం కౌన్సిలర్ స్థానాలకే పరిమితం కాకుండా, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవులు కూడా ఎంఐఎం ఖాతాలోకి వచ్చేలా పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తారని పేర్కొన్నారు.ప్రజల సమస్యలపై గళమెత్తే పార్టీగా ఎంఐఎం నిలుస్తుందని, అభివృద్ధి, సమానత్వ, సేవలే తమ ప్రధాన లక్ష్యంగా ఉంటాయని స్పష్టం చేశారు కాజా లియాఖత్ అలీ మొహసిన్. జిల్లాలో పార్టీని విస్తరించడమే కాదు, ప్రతి మున్సిపాలిటీలో గెలుపు కోసం బూత్ స్థాయిలో కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుమెర్ ఉద్దీన్ అజాద్, అదిల్ పటేల్, మాజీ కౌన్సిలర్ రజి, అబ్దుల్ రెహమాన్, హఫీజ్ అసద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండగట్టు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ





**కొండగట్టు, జనవరి 9 (ప్రజా మంటలు) :** మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 31 బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.83 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వ్యాపారులను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.83.12 లక్షలు, విద్యుత్ శాఖ నుంచి రూ.29 లక్షలు, డీఆర్‌డీఓ ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందన్నారు.ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ బాధితుల పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం హామీ మేరకు సహాయం అందించిందన్నారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సహాయంతో బాధితులు తిరిగి వ్యాపారాలు ప్రారంభించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ప్రమాద బాధితులు ప్రభుత్వం త్వరితగతిన స్పందించి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఆర్‌డీవో రఘువరన్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com